# రామ లక్ష్మణులు

స్కూల్ విడిచిపెట్టగానే, జట్లు జట్లుగా పిల్లలందరూ కేరింతలు కొడుతూ, ఆవరణ అంతా సందడి చేస్తున్నారు. బస్సులో వెళ్ళవలసిన వాళ్ళంతా హడావిడిగా బస్సెక్కేసారు. కొన్ని ఆటోలు, మరికొన్ని రిక్షాలు, పిల్లల్ని తమలో ఇముడ్చుకొని సాగి పోతున్నాయి. కాస్త దగ్గర ఇళ్ళ నుంచి వచ్చే పిల్లలయితే, బిలబిలమంటూ పరుగులు తీస్తున్నారు.

బాధ్యతతో మునిగిన టీచర్లూ, స్కూల్ సిబ్బందీ అయితే సరేసరి. తమ పని పూర్తి కాగానే బయటపడి ఎవరికి వారే అన్నట్లు తలోదారీ పట్టారు.

ఈ హడావిడిలో

'రాముని' పట్టించుకునే దెవరు ? కాళ్ళు పరుగులు తీయగలిగినా, మనస్సు ఇంటివైపుకు సాగనివ్వడం లేదు. ఆకలి దంచేస్తున్నా, చప్పున ఇంటికి వెళ్ళిపోయి, అమ్మ పెట్టే కమ్మని ఫలహారాలు, తినాలనీ అనిపించటం లేదు. తనకెంతో ఇష్టమని బాక్సులో అమ్మ పెట్టిన బంగాళదుంప వేపుడూ, అన్నం, పెరుగు, అవేవీ తినలేదు తను. పోనీ ఇంటికి వెళ్ళడంతోనే, పుస్తకాల బరువు దించేసుకొని, హాయిగా ఆటల్లో మునిగిపోవాలనీ లేదు.

వాడి చిన్న బుర్రను తొలిచేస్తున్న ఒకే ఆలోచన, దేనిమీదా బుద్ధి పోనివ్వకుండా చేస్తోంది. యాంత్రికంగా నాలుగు అడుగులు వేసి. అలానే నిలబడిపోయాడు.

తను ఇక ఈ స్కూల్‌కి రాకూడదు. తను అడిగినట్టు కనుక రెసిడెన్షియల్ స్కూల్‌కి పంపకపోయారో చదువే మానేయాలి. చదువు మానేస్తే " అమ్మో ...! తను పెద్దవాడయ్యాక ఏం చేయాలి ...? చిన్నప్పుడు చదువుకుంటేగా, పెద్దయ్యాక మంచి ఉద్యోగం వచ్చేది."

" నువ్వు బాగా చదువుకొని అమెరికా వెళ్ళాలిరా అంటాడు మావయ్య"

మరి ఇప్పుడు చదువు మానేస్తే, అవన్నీ ఎలా ...!

"నాన్నగారే తన మాట వింటే ఏంపోయింది. వాళ్ళు తనకంటే పెద్దవాళ్ళు తను చెప్పినట్టు వాళ్ళెందుకు చేస్తారు ? వాళ్ళమాటే తను వినాలి. వాళ్ళు ఏం చేయమంటే, అదే చేయాలి. పిల్లలు, పెద్దలకి ఎదురు చెప్పకూడదట. ఎందుకు? వాళ్ళయితే కొట్టచ్చు. వాళ్ళ మాట తను విని తీరాలట. చస్తే వినడు. ఏం చేయగలరే? మొండి వెధవ అంటారు. చేతికొచ్చిన దెబ్బ కొడతారు."

"ఏయ్ బాబూ.. ఏమిటా పరధ్యానం. నేను చూసుకున్నాను కనుక సరిపోయింది. సైకిలు గుద్దేసుంటే ఏమయ్యేది.

అదిరిపడ్డాడు రాము. మరికాస్త మందలించి, అతను తన సైకిల్ పై ముందుకు దూసుకుపోయాడు.

నిజమే... ! అతను చెప్పినట్లు తను ఇలా నడి రోడ్డుమీద నిలబడి పోవడం తప్పే. " ఎలా అయినా ఇంటికి వెళ్ళక, తప్పదుగా అనుకుంటూ నెమ్మదిగా నడవ సాగాడు."

" మా బుచ్చిబాబు.. మాలచ్చన్న. బంగారు తండ్రి. "నాన్నగారు తమ్ముడిని ఎత్తుకొని ముద్దులు పెట్టేసుకుంటున్నారు. తను ఇంట్లోకి రావడమే చూడలేదు.

"కౌసల్యా ... వీడేంచేసాడో చూడు. నేను వాచీ మర్చిపోయి బయటికి వెళ్ళిపోతుంటే, వాచీ తెచ్చి అందించాడు లచ్చన్న." అంటూ అరుస్తున్నారు.

అమ్మ అంతకన్నానూ.

"ఏంటీ... నా చిట్టి తండ్రి, బెడ్‌రూంలో ఆ మూలగూట్లో ఉన్న, వాచీ తెచ్చి మీకిచ్చాడా....! అబ్బో.. అబ్బో.... బంగారు కొండ."

నాన్న దగ్గర నుంచి తమ్ముడ్ని తీసుకొని, తను ఒళ్ళో కూర్చో పెట్టుకుంది.

"ఛీ..ఛీ.. వీళ్ళకి వీడంటేనే ఇష్టం తనంటే అసలు ముద్దే లేదు." రాము మనస్సు ఉక్రోషంతో ఉడికిపోయింది.

"అన్నయ్య వచ్చేసాడు". అంటూ చెంగున లేచి, పుస్తకాల బ్యాగ్ అందకోబోయే సరికి, రాముకి మరీ ఒళ్ళు మండింది.

" చాల్లేరా... కుంటి కాళ్ళతో పరుగెత్తి, నాకేం నువ్వు సాయం చెయ్యనక్కరలేదు." అన్నాడో లేదో, వాడి చెంప చెళ్ళుమంది.

"నీకెన్ని సార్లు చెప్పానురా. తమ్ముడ్ని కుంటి వాడు అనొద్దనీ, నువ్వంటే ఎంతో ఇష్టం కనుకనే, రోజూ నువ్వు కసురుకుంటున్నా, నువ్వు రాగానే పుస్తకాలు అందుకోబోతాడు. వాడి అభిమానాన్ని అర్థం చేసుకోవేమిరా ...?

"మీరు మరీనండి. పిల్లాడు గుమ్మంలోకి రాగానే, పసివాడని చూడకుండా కొట్టడమే. వాడేదో అన్నాడే అనుకోండి... మనం నచ్చచెప్పాలి కానీ, ఇలా చెయ్యి చేసుకోకూడదండి" అంటూ, కొడుకుని దగ్గరకు తీసుకోబోయింది.

"నువ్వేం నాన్నకు చెప్పక్కరలేదు. మీ ఇద్దరూ ఒకటే మీకు వాడంటేనే ఇష్టం." విసురుగా స్కూల్ బ్యాగ్ విసిరేసి, ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఏడేళ్ళ ఆ పసివాడు సరదాగా ఆటలాడుకోకుండా, అమ్మ చేసిన స్వీటు ఆనందంగా తినకుండానే, ఆ చల్లని సాయంత్రం చీకటి రాత్రిగా మారింది. ఈ ఒక్కరోజే కాదు. రెండు వారాలుగా, ఆ ఇంట్లో ఇదే పరిస్థితి. ఈ స్థితిని తట్టుకోలేకపోతున్నారు. ధశరధరావు కౌసల్య.

ఒక్కోసారి ఆ ఇద్దరికీ జీవితం మీద విరక్తి కలుగుతుంది. భగవంతుడి మీద పట్టరాని కోపమూ వస్తుంది.

"తమ బిడ్డలిద్దరూ ఒకేలా ఉండచ్చుగా ఈ అవిటితనం వీడికి ఎందుకివ్వాలి దేవుడు,' అని ఆవేదన పడ్డారు.

"పోనీ, తమ పాపమో, శాపమో వీడి బ్రతుకు ఇలా అయ్యింది. తమ బిడ్డ ఒక్కడే కాదుగా, వికలాంగులు ఎంతో మంది ఉన్నారు.

శ్రద్ధగా పెంచి, చక్కగా చదివిస్తే వీడూ ప్రయోజకుడౌతాడు. తల్లి దండ్రులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించగలిగితే చాలు," అనుకొని సమాధానపడతారు.

తెగని సమస్య ఒక్కటే. రామూ ప్రవర్తన.

తమ్ముడి పట్ల రామూకి ఆపేక్ష కలిగి, వాడిని ప్రేమగా చూడకపోతే, ఇప్పుడిప్పుడే ఊహ తెలుస్తున్న చిన్నారి లక్ష్మణ్, తన లోపాన్ని కొండంతగా చేసుకొని కృంగిపోతాడు.

"వాడిని అపురూపంగా చూస్తున్నాం" అని, రాము తమ్ముడి మీద ద్వేషం పెంచుకుంటూపోతే, రామూ కూడా ఎందుకూ పనికి రాకుండా తయారౌతాడు.

"రామూ మనస్సు ఎలా మార్చటం" ఇద్దరూ తలలు పట్టుకున్నారు.

"కోపం వచ్చిందా అన్నయ్యా... రేపటి నుంచి నీ పుస్తకాలే ముట్టుకోను. నువ్వన్నది నిజమే. నేను కుంటివాన్నే. నాన్న ఉత్తినే నిన్నుకొట్టారు. అమ్మ నా నుంచే నిన్ను తిడుతుంది. నేను అల్లరి చేసి, నిన్ను కొట్టించనులే, పోనీ, నీతో జట్టు కట్టనే కట్టను. నువ్వద్దంటున్నావుగా... నీ దగ్గరకే రాను, నువ్వు సరదాగా ఆడుకో అన్నయ్యా బాగా చదువుకో, అమ్మా నాన్నా మెచ్చుకుంటారు.

అన్నయ్య అలా చిన్నబోయి కూర్చుంటే, తోచని లక్ష్మణ్ కుంటుకుంటూ నెమ్మదిగా రాము దగ్గరకు వచ్చి, తన మనసులో మాటలన్నీ చెప్పేశాడు.

" చాల్లేవో... పెద్ద చెప్తున్నావ్, అమ్మా, నాన్న నన్నేం మెచ్చుకోరు... నువ్వుకుంటి కాలుతో నడుస్తూ, ఎంత చిన్న పని చేసినా, శబాష్ అంటారు. ఎత్తుకొని ముద్దులాడుతారు."

"అలా అంటావ్ ఎందుకన్నయ్యా నువ్వు, నేనూ, అమ్మా నాన్నకి ఒకటే. నువ్వంటే బోలెడంత ఇష్టం, ముద్దూ, మారామూ... క్లాసు ఫస్ట్ అని, చక్కగా బొమ్మలేస్తాడని అందరితో చెప్తున్నారుగా"

"నిన్ను మాట్లాడొద్దూ అన్నానా ముందు ఇక్కడ్నుంచి వెళ్ళు. " రామూ లేలేత కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. లక్ష్మణ్ చిన్నారి కళ్ళల్లో నీళ్ళు చింది చెక్కిళ్ళపై జారిపోయాయి.

"హు... ఎన్ని కబుర్లు చెప్తున్నాడు, వెధవ ... నేనూ - వాడూ, అమ్మా నాన్నలకి ఒకటి కానే కాదు. అలా అయితే, నేను వాన్నొక్క మాటంటే చాలు. కోప్పడతారు. కొట్టేస్తారు. కుంటివాన్ని కుంటివాడనక మరేమనాలి...?

"వాడి ముఖానికి చదువు కూడానా," తమ్ముడి చదువు తల్చుకునే సరికి, అసహ్యం పుట్టు కొచ్చింది రాముకి.

పై వారం నుంచి వాన్ని స్కూలుకి తీసుకెళ్ళాలట. తనయితే చెంగు చెంగున ఎగురుతూ, హుషారుగా స్కూల్‌కి వెళ్ళిపోతాడు. వీడూ తయారయితే ఆ కుంటి నడక, తనూ నడవవలసిందే.

తమ్ముడ్నీ చెయ్యి పట్టుకొని నెమ్మదిగా తీసుకెళ్ళాలి. స్కూల్లో వాడికి ఏ అవసరమొచ్చినా నువ్వే దగ్గరుండాలి అంటూ, బుద్ధులు చెబుతున్నారు" నాన్న. తను అలా చెయ్యనే చెయ్యడు. అసలు, ఇప్పటికి స్కూల్లో ఎవ్వరికీ, తనకి కుంటి తమ్ముడు ఉన్నాడనే తెలీదు. ఆసంగతి తెలిసిపోతుందనే, భయపడి ఫ్రెండ్స్ ఎవ్వరినీ ఇంటికి రానివ్వడు. నాన్న చెప్పినట్టు తనతో తమ్ముడిని స్కూల్‌కి తీసుకెళ్ళడం మొదలెడితే.

"రాముకి కుంటి తమ్ముడు ఉన్నాడూ" అని. అందరూ వెక్కిరిస్తారు. నవ్వుతారు.

ఛీ...ఛీ... అలా కాకూడదు. అందుకేగా తను, రెసిడెన్షియల్ స్కూల్‌కి వెళ్ళిపోతానంటుంది. అమ్మా నాన్నతో పేచీ, తన మాట వినిపించుకోరు వాళ్ళు. ఏం చేయాలి? సతమత మయిపోతున్న ఆ పసివాడి బుర్రలో మెరుపులాంటి ఆలోచన. దిగ్గున లేచి, షర్టు వేసుకున్నాడు. పుస్తకాలన్నీ వెదికాడు. రెండు పదినోట్లు అయిదు రూపాయల కాయిన్ దొరికాయి. డబ్బులు జేబులో పెట్టేసుకొని, ఎస్.టి.డి బూత్‌కి తుర్రుమన్నాడు.

మావయ్యే రిసీవర్ అందుకొని,

" ఏరా రామూ ....!"

అనేసరికి పొంగి పోయాడు. తన బాధ అంతా మావయ్యతో ఫోన్‌లో వెళ్ళబోసుకున్నాడు.

"అరి బడవా... నేను, అమ్మా నాన్నకి చెప్తానుగా. ఈ విషయం నాకు వదిలేయ్ అంతా నీ ఇష్ట ప్రకారమే జరిగేట్టు చూస్తాను నువ్వు ఇదేమీ, బుర్రలో పెట్టుకోకు. బుద్ధిగా చదువుకో. రెండు రోజుల్లో నేనూ అత్తయ్య వస్తాంగా..."

ఫోన్‌లోనే రాముకి ముద్దిచ్చి ఫోన్ పెట్టేసాడు. రాముూ కూడా రిసీవర్‌ని ముద్దు పెట్టుకుని, మా మంచి మావయ్య అనుకున్నాడు.

మర్నాడు రామూ, చాలా మామూలుగా ఉన్నాడు. దెబ్బలు తినలేదు. చీవాట్లు పెట్టించుకోలేదు. ఉత్సాహంగా స్కూల్‌కి వెళ్తుంటే, వీడిలో కాస్త మార్పు వొచ్చిందేమో ఆశగా అనుకున్నారు, అమ్మా, నాన్నలు.

"బలే... బలే... మావయ్య వస్తాడు. అమ్మా నాన్నల పనిపడ్తాడు. ఇంకెన్నాళ్ళులే, వీడి గొడవ " రాము ముఖంలో వెలుగునింపిన ఆలోచన అది.

"ఏమర్రా... మీరంతా సాయంత్రం నా బర్త్‌డే పార్టీకి వస్తున్నారుగా"

స్కూల్లో పిల్లలందరికీ చాక్లేట్లు పంచిపెడుతూ అన్నాడు రాజా.

" ఓ తప్పకుండా" అన్నారు. వాడి మిత్ర బృందం.

ఇంటర్‌వెల్‌లో రాజా, రామూ దగ్గరకు వచ్చి. అమ్మ తన టిఫిన్ బాక్సులో పెట్టిన హల్వా, స్పూన్‌తో నోటికి అందించాడు.

"నువ్వు నాబెస్ట్ ఫ్రెండ్‌వి. మరి నువ్వే ముందు వచ్చేయాలి సుమా!" చేతులు పట్టుకొని ఊపేశాడు.

"ఖచ్చితంగా వస్తానురా స్కూలు వదిలేయగానే కలిసి వెళ్ళపోదాం. సరేనా..." రాజా చేతిలో చెయ్యి వేసి, అన్నాడు రాము.

ఆ స్నేహితులిద్దరూ ఒకరిని ఒకరు కౌగిలించుకున్నారు. ఆ ఇద్దరూ మంచి నేస్తాలు. రాజా ఎంత చెబితే, రామూ అంతే. అన్నింటిలోనూ రాజాని అనుకరించడానికి ప్రయత్నిస్తాడు. రాజాకి క్రికెట్ ఆడటం ఇష్టం. రామూ దానిలోనే ఆసక్తి పెంచుకున్నాడు. మొన్న వేసవి సెలవుల్లో, రాజా ఈత నేర్చుకుంటే , తనకి నీళ్ళలో ఈదడం అంటే కాస్త భయం ఉన్నా, ధైర్యం చేసేశాడు. అన్ని విషయాల్లోనూ, ఇద్దరూ జోడు. ఎంతో అందంగా, మరింత చురుకుగా ఉండే, రాజా అంటే, రామూ ప్రాణం పెట్టేస్తాడు.

రెసిడెన్షియల్ స్కూల్లో చేరిపోవాలని ఎంత పంతంగా ఉందో, రాజాని విడిచి వెళ్ళాలంటే, అంత బాధగానూ ఉంది. మావయ్య వస్తాడు. తన కోరిక తీరుస్తాడు. రాజా ఎప్పుడూ కనబడ్డు. రాజా మళ్ళీ పుట్టినరోజుకి, తన ఈ ఊళ్ళోనే ఉండడు, అనుకుంటేనే ఏడుపు వచ్చేస్తోంది.

" ఆ లక్ష్మణ్ గాడ్నించే, రాజాని వదిలేసి వెళ్ళిపోవాలి. ప్చ్... యి వాళంతా రాజాతో

సరదాగా గడపాలి.. లక్ష్మణ్ నుంచే మనం విడిపోతున్నామని, వాడికి చెప్పేయాలి."

"రాజా... మనం ఇప్పుడే టీచర్‌కి చెప్పి, మీ ఇంటికి వెళ్ళిపోదాము... రా ఫ్రెండ్స్ అంతా వచ్చేదాకా, మనిద్దరం కబుర్లు చెప్పుకోవాలి." ఆశగా అడిగాడు రాము.

"తప్పుగా, క్లాసులు మిస్సవకూడదు. మనం వెళ్ళేసరికి నా బర్త్‌డే పార్టీకి అన్నీ, రెడీ చేసేస్తుంది. మా అమ్మ. స్కూలు పూర్తయిన తరువాతే వెళదాం. " క్లాసు రూంలోకి దారితీసాడు రాజా.

రాజా వాళ్ళ ఇల్లంతా సందడిగా ఉంది. రాజా స్నేహితులకి పంచడానికి, రంగురంగుల బంతులు రకరకాల మిఠాయిలు కొని తెచ్చారు. వాళ్ళనాన్న. రాజా వాళ్ళ అమ్మ అయితే పిల్లలందరికోసం ఘుమ ఘుమలాడే బిరియానీ తయారు చేస్తోంది. నోరూరుతుంది, రాముకి. బిలబిల మంటూ స్నేహితులతా వచ్చేశారు. రాజా చెప్పలేనంత సంతోషంగా ఉన్నాడు.

వంటింట్లో పని ముగించుకొని, పట్టుచీర కట్టుకొని వచ్చింది వాళ్ళ అమ్మ.

చిటికెలో హాలంతా నీట్‌గా సర్దేసి, కేకుటేబుల్‌పైన పెట్టింది.

"దానాన్న... నువ్వుకేక్ కట్ చేసేద్దూగానీ, నీ ఫ్రెండ్స్ అంతా వచ్చేసారుగా".. అంది.

"కమాన్ రాజా క్విక్.. క్విక్...' కెమెరా పట్టుకొని తొందర చేస్తున్నారు వాళ్ళ నాన్న.

"కాసేపు ఆగుదాం... కిట్టీ రావాలిగా ?"

"నేను చెప్పాను కదా నాన్న, వాడికి కాలు నొప్పిగా ఉంది. రాలేదు అని. నీ బర్త్‌డే పార్టీ అయిపోగానే, మనమే కిందకి వెళదాంలే. మా రాజా బాబు బంగారు..., అమ్మ మాట వింటాడుగా...

రాజాకి మనసొప్పలేదు. కిట్టప్ప లేని పుట్టినరోజు ఏం పండుగా? రాజా ముఖం కళావిహీనమైంది. రాజా ఫ్రెండ్స్ ఎవ్వరికీ కిట్టీ అంటే ఎవరో తెలీదు. వాళ్ళంతా విస్తుబోయి చూస్తున్నారు.

" ఇంతకీ 'కిట్టీ' ఎవర్రా...! మే మందరం ఉన్నాంగా... ఎంచక్కా కేక్ కట్ చేసేరా అని రామూ" అంటుండగానే...

కిట్టీ వాళ్ళందరి మధ్యకి వచ్చాడూ. కిట్టీని కళ్ళార్పకుండా చూస్తున్నాడు రాము వాడి రెండు కాళ్ళూ పుల్లల్లా ఉన్నాయి. అలా పాకుతూ, వచ్చి, "అన్నయ్యా" అంటూ రాజాని చుట్టేసుకున్నాడు.

పార్టీ జరుగుతుండే కానీ, రామూ మనసు మనసులో లేదు. అయితే,

"రాజాకీ ఇలాంటి తమ్ముడున్నాడా...! వీడంటే రాజాకి ఇంత ఇష్టమా"...., పార్టీ పూర్తయి, అందరూ వెళ్ళిపోగానే ఆ మాటే అన్నాడు.

స్నేహితుని జవాబు వింటూనే, షాక్ తిన్నాడు.

"అదేంట్రా అలా అయిపోతున్నావ్ ఇలాంటి వాళ్ళకే మనం ఎంతో సాయం చేయాలి. వీళ్ళకేరా... మనం ఎక్కువ స్నేహాన్ని పంచాలి. నేను చెప్పాను కదరా... స్కూల్‌కి వెళ్ళినప్పుడు తప్ప వీన్ని నేను ఎప్పుడూ  వదలను. వచ్చే వారం నుంచీ వీళ్ళ నాన్న, వీడ్ని నాతోనే స్కూల్‌కి పంపుతున్నారు. నేను సంతోషంగా ఒప్పుకున్నానురా. కిట్టీ కోసం మీరేమీ బెంగపెట్టుకోకండీ... స్కూల్లో అంతా కిట్టీని, నేను జాగ్రత్తగా చూసుకుంటాను," అన్నానురా.

ఇక వినలేక పోయాడు రాము. స్నేహితుని చేతుల్లో ముఖం దాచుకొని బోరున ఏడ్చేశాడు. తన తమ్ముని సంగతీ, తను అనుకున్నదీ అంతా దాచకుండా చెప్పేశాడు.

"నేను తప్పు చేశానురా... ఇంక లక్ష్మణ్‌ని క్షణం కూడా వదలను. నీకేమీ కాని పక్కింటి అబ్బాయిని, నువ్వు తమ్ముడిలా ఇంత ప్రేమగా చూసుకుంటున్నావ్... నేను నా అసలు తమ్ముణ్నే, ఛీ ... ఫో... అని ఏడిపిస్తున్నానురా. అందుకే అమ్మా నాన్నా కూడా, ఎంత బాధ పడుతున్నారో," "పోనీలేరా... నీ తప్పు నీకు తెలిసింది కదా... ఎంచక్కా మీ ఇద్దరూ కలిసి స్కూల్‌కి రండి. " అంటూ ఓదార్చాడు.

అన్న... తనని, ముద్దు చేస్తూ ఉంటే, స్కూల్‌కి కూడా తీసుకు వెళతానంటుంటే, పట్టరాని, సంభరంగా ఉంది లక్ష్మణ్‌కి.

ఆ ఇద్దరినీ అలా చూస్తున్న తల్లిదండ్రుల ఆనందానికి అవధులే లేవు. తొలిసారిగా లక్ష్మణున్ని రామూ స్కూల్‌కి తీసుకెళుతుంటే

" మీ ఇద్దరూ ఎప్పుడూ, ఇలాగే ఆ రామ లక్ష్మణుల్లా కలిసి మెలసి ఉండాలి" అంటూ దీవించారు.

తమ బిడ్డలిద్దరినీ అక్కున చేర్చుకొని, ఆనందభాష్పాలతో ముద్దుల వర్షం కురిపించారు. కౌసల్య, ధశరథరావులు.

*మార్చి2001 వార్తాతేజ మాసపత్రిక* ❑